

నేడు ఆచంటలో చంద్రబాబు సభ

ఆచంట (పశ్చిమగోదావరి): ఆచంటలో ఈ నెల ఏడో తేదీ ఆదివారం నిర్వహించే భారీ బహిరంగ సభకు లక్ష మంది హాజరవుతారని టిడిపి ఉభయగోదావరి జిల్లాల సమన్వయకర్త గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. శనివారం మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. సమావేశంలో మాజీ ఎంఎల్‌ఎలు ఆరిమిల్లి రాధాకృష్ణ, గన్ని వీరాంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటన సాగేదిలా

చంద్రబాబు ఆదివారం మధ్యాహ్నం 3:30 గంటలకు స్థానిక ఎపిఐఐసి కార్యాలయం వెనుక ఉన్న లేఅవుట్‌లో హెలీప్యాడ్ వద్ద దిగనున్నారు. అక్కడి నుంచి రోడ్‌షో నిర్వహించుకుంటూ 3:50 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకుంటారు. నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం మార్టేరు మీదుగా రోడ్డు మార్గంలో రాజమండ్రి వెళ్తారు.

వ్యవసాయ శాఖలో అలజడి..!

జిల్లా అధికారి వై.రామకృష్ణపై ఉద్యోగుల తిరుగుబాటు
తమను వేధిస్తున్నారంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు
కొంతమంది ఉద్యోగులు సెలవుపై వెళ్లనట్లు సమాచారం
ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని ఉద్యోగుల వేడుకోలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'జిల్లా వ్యవసాయశాఖలో తీవ్ర అలజడి నెలకొంది.. ఆ శాఖ ఉద్యోగులు జిల్లా అధికారిపై తిరుగుబాటుకు దిగారు.. వ్యవసాయశాఖలో పని చేస్తున్న ఉద్యోగులను ఆ శాఖ ఉన్నతాధికారి వై.రామకృష్ణ వేధింపులకు గురి చేస్తున్నారంటూ.. ఆ వేధింపులు తాళలేక ఆ శాఖలో పని చేసే ఉద్యోగులంతా మూకుమ్మడిగా రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారా' అంటే అవుననే సమాధానం వస్తోంది. జిల్లా జనాభాలో 80 శాతం ప్రజలకు వ్యవసాయమే జీవనాధారం. నిరంతరం ప్రజలతో మమేకమయ్యే వారిలో వ్యవసాయ శాఖాధికారులది ప్రత్యేక పాత్ర. ప్రజలకు అత్యంత ముఖ్యమైన వ్యవసాయశాఖలో నెలకొన్న పరిణామాలు తీవ్ర ఆందోళన కల్గిస్తున్నాయి. 2022 ఏప్రిల్ నాలుగో తేదీన జిల్లాల విభజన అనంతరం వై.రామకృష్ణ ఏలూరు జిల్లా వ్యవసాయాధికారి (డి.ఎ.ఒ)గా బాధ్యతలు తీసుకున్నారు. రామకృష్ణ జిల్లా అధికారిగా వచ్చాక కార్యాలయంలో పని చేసే అధికారులు, సిబ్బందిపై చిన్న చిన్న విషయాలకు అందరి ముందు అవమానించడం, ఆడ, మగ తేడా లేకుండా దూషించడం వంటి చేష్టలకు పాల్పడుతున్నారని, దీంతో ఉద్యోగులు మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. జిల్లాల విభజన తర్వాత సిబ్బంది కొరత ఉన్నప్పటికీ కష్టపడి పనిచేస్తూ సహాయ సహకారాలు అందిస్తున్నా జిల్లా అధికారి తమ కష్టనష్టాలను ఏమీ పట్టించుకోవడం లేదంటూ ఫిర్యాదులో ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. బయటికి చెప్పుకోలేని భాషను వాడుతున్నారని పేర్కొన్నట్లు సమాచారం. కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగులకు రెండు దారులు మాత్రమే కన్పిస్తున్నాయని, ఒకటి ఉద్యోగం మానేసి వెళ్లిపోవడం, లేదా చావే శరణ్యం అన్నట్లుగా ఉందని ఫిర్యాదులో పేర్కొనడం చూస్తే వ్యవసాయ శాఖలో ఏం జరుగుతుందో అనే అనుమానాలు నెలకొన్నాయి. జనవరి ఒకటో తేదీ వేడుకలకు ఏర్పాట్లు సరిగా చేయలేదని తీవ్ర పదజాలంతో దూషించారని, మీ అంతు చూస్తానని బెదిరించారని ఉద్యోగులు తమ ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. ఇలా అనేక విషయాలను ఉన్నతాధికారులకు చేసిన ఫిర్యాదులో ఉద్యోగులు వివరించారు. అంతేకాకుండా సాయంత్రం ఆరు తర్వాత కార్యాలయానికి వచ్చి రాత్రి పొద్దుపోయే వరకూ పని చేయాలని హుకుం జారీ చేస్తారని ఆరోపించారు. గతంలో ఒకసారి ఈయనపైన అప్పటి కమిషనర్ పూనం మాలకొండయ్యకు ఉద్యోగులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అప్పుడు అందరితో మాట్లాడి సమస్యను సర్దుబాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. మళ్లీ వేధింపులు పెరిగిపోవడంతో ఉద్యోగులు మరోసారి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని జిల్లా వ్యవసాయ అధికారి తీరుపై విచారణ జరిపించాలని ఉద్యోగులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు ఏవిధంగా స్పందిస్తారో వేచిచూడాలి. జిల్లాలో కీలకమైన వ్యవసాయశాఖ అధికారిగా ఉన్న ఈయన రైతులతోపాటు, ఎవరు ఫోన్ చేసినా అసలు స్పందించని విమర్శలు సైతం ఉన్నాయి.



పని గురించే తప్ప.. వేరేవిధంగా మాట్లాడలేదు
వై.రామకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి

ఉద్యోగుల ఫిర్యాదుపై జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణను వివరణ కోరగా ఉద్యోగులు తనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. వ్యవసాయశాఖకు సంబంధించిన పనులు, ఫీల్డ్ యాక్టివిటీలో అన్ని రకాలుగా జిల్లాను ముందుకు తీసుకెళ్తున్నామని, పని గురించి తప్ప వేరేవిధంగా మాట్లాడింది లేదని అన్నారు. పనిలో భాగంగా కోప్పడటం, తిట్టడం సాధారణంగా జరుగుతోందని, ఇదంతా పనిమీదనే తప్ప అంతకంటే ఏమీ ఉండదని తెలిపారు. బూతులు తిడితే ఆ రోజే ఫిర్యాదు చేయవచ్చు.. అలాకాకుండా ఇప్పుడు ఫిర్యాదుచేయడం ఏమిటో తెలియడం లేదని, పని గురించి తప్ప అంతకు మించి ఏమీ మాట్లాడ లేదని స్పష్టం చేశారు.

షోకాజ్ నోటీసు కాపీలు దహనం

18వ రోజుకు సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తక్షణం విధుల్లోకి చేరకపోతే సమగ్ర శిక్ష ఉద్యోగులను తొలగిస్తామంటూ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇచ్చిన షోకాజ్ నోటీస్ కాపీలను సమగ్ర శిక్ష అభియాన్ కార్యాలయం వద్ద ఉద్యోగుల దహనం చేశారు. నోటీసులకు బెదిరేది లేదని, బెదిరింపులతో ఉద్యమాన్ని నీరుగార్చాలని ప్రభుత్వం చూస్తుందని, తమ సమస్యలు పరిష్కారమయ్యేవరకూ పోరాటం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు.



షోకాజ్ నోటీసు కాపీలను దహనం చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె శనివారానికి 18వ రోజుకి చేరింది. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్ వద్ద తమ నిరసన తెలిపారు. ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జెఎసి నేతలు మాట్లాడుతూ విద్యాశాఖలో కీలకపాత్ర వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సిఎం జగన్ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పిఆర్‌సి అమలు చేయకుండా నెలల తరబడి వేతనాలు విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష జెఎసి నాయకులు వినోద్, జాన్సీ, భగవాన్, రాజు, రాధిక, కేశవరావు, సత్య, సందీప్, దిలీప్ పాల్గొన్నారు.

కొల్లేరు ప్రజలను ఆదుకునేదెవరు?

హామీలిచ్చి మోసగించిన ప్రభుత్వాలు
చేతులెత్తేసిన ప్రజాప్రతినిధులు
సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అధికారం కోసం హామీలిచ్చి గద్దెనెక్కాక మోసం చేస్తున్న ప్రభుత్వాలు ఒక పక్క 'మీ సమస్యలు పరిష్కరిస్తాం.. మమ్మల్ని గెలిపించండి' అని చెప్పి ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఆ తర్వాత చేతులెత్తిన వైనం మరోపక్క ఉంటే కొల్లేరు ప్రాంత ప్రజలను ఆదుకొనేది ఎవరని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి సూటిగా ప్రశ్నించారు. కొల్లేరు ప్రాంత ప్రజలు తమ జీవితాలను, ఉపాధిని కాపాడాలని కోరుతూ ఆందోళనలు చేస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో ఐదో కాంటూరు పైన పది కిలోమీటర్ల వరకు పర్యావరణ పరిరక్షణ పేరుతో 26 నిబంధనలను పెట్టి వేలాది మంది కొల్లేరు ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని విమర్శించారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని, కాలుష్య నివారణకు ప్రతిపాదిత రెగ్యులేటర్లు నిర్మించాలని, పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకుంటూనే కొల్లేరు ప్రజల ఉపాధిని కాపాడాలని, 22 వేల ఎకరాల ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని, కొల్లేరు ప్రాంత ప్రజలకు అదనంగా ఉపాధిహామీ పనులు కల్పించాలని కొల్లేరు ప్రజలు కోరుతుంటే, వారి న్యాయమైన డిమాండ్లకు సిపిఎం అండగా నిలబడి పోరాడుతుంటే పట్టించుకోకుండా, ప్రజల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోకుండా కలెక్టర్ కార్యాలయంలో కొల్లేరు సున్నిత పర్యావరణ ప్రాంత నిర్ధారణ సమావేశం జరిపి కొల్లేరు ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పాటుకు అడుగులు వేయడం అభ్యంతరకరంగా ఉందని ఆయన అన్నారు. కొల్లేరు ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొల్లేరు ప్రాంత ప్రజల మనుగడే ప్రశ్నార్థకంగా మార్చే సెన్సిటివ్ జోన్ ప్రతిపాదనను స్పష్టంగా వ్యతిరేకించకపోవడం శోచనీయమన్నారు. కొల్లేరు ప్రజల అసలు సమస్యలను వదిలేసి కేంద్రం చెప్పిందనే పేరుతో ఎకో సెన్సిటివ్ జోన్‌గా విస్తరించాలని, దానికి సంబంధించిన కసరత్తులు చేయడం తగదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొల్లేరు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, పర్యావరణంతో పాటు కొల్లేరు ప్రజల ఉపాధిని కాపాడాలని డిమాండ్ చేశారు.

ట్రిపుల్ ఐటిలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

నూజివీడు ట్రిపుల్ ఐటిలో ట్రాన్స్‌ఫార్మర్ల లోపం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో విద్యార్థులు రెండు రోజులుగా ఇబ్బందులు పడుతున్నారని రవి తెలిపారు. అసలు సమస్య ఎక్కడ ఉత్పన్నమైందో గుర్తించడంలో అధికారులు విఫలం ఒకవైపు, మరోవైపు లక్షలాది రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన జనరేటర్లు సైతం నిర్వహణ లోపంతో పూర్తిస్థాయిలో పని చేయడం లేదన్నారు. ఫలితంగా విద్యుత్ లేక వసతికి, నీటి సరఫరాకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయన్నారు. గత నెల 27 నుండి ఈ నెల పదో తేదీ వరకూ క్యాంపస్‌లో ఇంటిగ్రేటెడ్ పియుసి, ఇంజనీరింగ్ విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయని, ఈ తరుణంలో ఈ విధంగా జరగడం వల్ల విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. యుద్ధ ప్రతిపాదికన విద్యుత్ సరఫరా సమస్యను పరిష్కరించాలని రవి డిమాండ్ చేశారు.

ప్రభుత్వం దిగొచ్చేవరకూ పోరాటం

24వ రోజుకు అంగన్వాడీల సమ్మె - ఏలూరులో 24 గంటల నిరాహార దీక్ష ప్రారంభం - పలుచోట్ల వినూత్న నిరసనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రభుత్వం దిగొచ్చే వరకూ పోరాటం ఆగదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. ఎస్మా ప్రయోగించినా, మెమోలు జారీచేసినా వెనక్కితగ్గేది లేదని వారు పేర్కొన్నారు. అంగన్వాడీల సమ్మె శనివారానికి 26వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు పలుచోట్ల వినూత్నంగా నిరసన తెలిపారు. ఏలూరులో చేపట్టిన 24 గంటల నిరాహార దీక్షను ఆలిండియా అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ ఫెడరేషన్ అఖిలభారత ప్రధాన కార్యదర్శి ఎఆర్.సింధు ప్రారంభించారు.

ఏలూరు అర్బన్ : స్థానిక కలెక్టరేట్ వద్ద అంగన్వాడీలు 24 గంటల నిరాహార దీక్షను చేపట్టారు. ఈ దీక్షలో అంగన్వాడీల యూనియన్ జిల్లా కార్యదర్శి పి.భారతి, ప్రాజెక్టు లీడర్లు స్వర్ణకుమారి, కె.సత్యవతి, త్రివేణి, నాగమణి, విమల మొత్తం 30 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్, అంగన్వాడీల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు కె.విజయలక్ష్మి, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జె.గోపి పాల్గొన్నారు.

ఎస్మా ను వ్యతిరేకిస్తూ ర్యాలీ

అంగన్వాడీల సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడాన్ని నిరసిస్తూ అంగన్వాడీలు భగ్గుమన్నారు. దీక్షా శిబిరం నుండి వందలాది మంది ఫైర్ స్టేషన్ రకూ నిరసన ర్యాలీ చేపట్టారు. అక్కడ మానవహారంగా నిలబడి నిరసన తెలిపారు. ఈ ర్యాలీకి సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, వి.సాయిబాబు, జె.గోపి నాయకత్వం వహించారు.

జీలుగుమిల్లి : మండలంలోని అంగన్వాడీలు పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజుకు వినతిని అందించారు. పింఛన్ల పంపిణీకి విచ్చేసిన ఎంఎల్‌ఎను తిరిగి వెళ్తుండగా అంగన్వాడీలు అడ్డుకున్నారు. 26 రోజులుగా సమ్మె చేస్తుంటే కనీసం ప్రభుత్వం స్పందించడం లేదని అడ్డుకున్నారు. సమస్యలు పరిష్కరించకుండా బెదిరింపులకు దిగడం సమంజసం కాదన్నారు. అనంతరం ఆయనకు వినతిని అందించారు. దీనిపై ఎంఎల్‌ఎ మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో మాట్లాడి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కొండలరావు, అంగన్వా డీలు నాగమణి, ఎస్తేరు, సరళ, జ్యోతి, పూర్ణావతి పాల్గొన్నారు.

చింతలపూడి : మండలంలోని అంగన్వాడీలు జిల్లాకేంద్రం ఏలూరులోని కలెక్టరేట్ వద్ద 24 గంటల దీక్షకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీల యూనియన్ నాయకులు ఎస్.సరోజని, కార్యదర్శి టి.మాణిక్యం మాట్లాడారు.

కొయ్యలగూడెం : మండలంలో అంగన్వాడీల సమ్మె కొనసాగింది. సమ్మెకు భవన నిర్మాణ కార్మికుల యూనియన్ నేత నారపల్లి రమణరావు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.ప్రసాద్, ఎం.వీరబాబు, ఆర్.వెంకటేశ్వరరావు, కె.నరేంద్ర, కె.బాలాజీ, టి.రాజు, ఎం.వెంకట సూరిబాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్ల బోయిన రాంబాబు, అంగన్వాడీల యూనియన్ నాయకురాలు శివరత్నకుమారి, వై.కోటేశ్వరి, కృష్ణవేణి, అడపా నాగజ్యోతి, సునీతారాయల్, బొబ్బిలి చిట్టి, కె.జ్యోతి, కె.మాధవి, పి.భాగ్యలక్ష్మి, వెంకటలక్ష్మి, మంగ, శ్రీదేవి, నుర్జహాన్ పాల్గొన్నారు.



ఏలూరులో..

బుట్టాయగూడెం : మండలంలోని అంగన్వాడీలు 26వ రోజు సమ్మెలో భాగంగా వినూత్నంగా తమ నిరసన తెలిపారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట పొర్లుదండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మాట్లాడుతూ 26 రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకొచ్చిన వైసిపి ప్రభుత్వానికి తగినగుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు భూదేవి, జ్యోతి, మంగతాయారు, దుర్గలక్ష్మి, రాజకుమారి, దుర్గ, మంగమ్మ, రామలక్ష్మి, మల్లేశ్వరి, కృపామణి పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 26వ రోజూ కొనసాగింది. ప్రభుత్వం అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీల యూనియన్ నాయకులు షేక్ అబిదాబేగం, జక్కంశెట్టి మేనక లక్ష్మి, రమాదేవి, అంగన్వాడీలు, హెల్పర్లు పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలో అంగన్వాడీల సమ్మె 26వ రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా చేపట్టిన దీక్షలో 140 మంది అంగన్వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

టిడిపి మద్దతు

అంగన్వాడీలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు దావు నాగరాజు అన్నారు. మండలంలోని అల్లూరులో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. వారి సమ్మెకు పార్టీ పూర్తిమద్దతిస్తుందన్నారు.

దిగిరాకపోతే దేశవ్యాప్త ఉద్యమం
అంగన్‌వాడీల 24 గంటల దీక్ష ప్రారంభంలో ఎఆర్.సింధు

ఏలూరుఅర్బన్: అంగన్వాడీల సమస్యలు పరిష్కరించ కుంటే సమ్మెను దేశవ్యాప్త ఉద్యమంగా మారుస్తామని ప్రధాని మోడీ, సిఎం జగన్‌ల భరతం పడతామని ఆలిండియా అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ ఫెడరేషన్ అఖిలభారత ప్రధాన కార్యదర్శి ఎఆర్.సింధు హెచ్చరించారు. అంగన్వాడీల సమ్మె 26వ రోజు శనివారం జిల్లాకేంద్రమైన ఏలూరులోని కలెక్టరేట్ వద్ద 24 గంటల నిరాహార దీక్షను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సింధు మాట్లాడుతూ మహారాష్ట్ర, కర్ణాటకలో నెలల తరబడి సమ్మెలు చేసి అక్కడ బిజెపి ప్రభుత్వ మెడలువంచి అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించుకున్నారని తెలిపారు. ఆ ఉద్యమాల స్ఫూర్తితో ఇక్కడ పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. రాష్ట్రంలో డబ్బులు లేవంటున్న జగన్ ప్రభుత్వం కేంద్రంలోని మోడీ ప్రభుత్వంపై ఎందుకు పోరాడటం లేదని ఆమె ప్రశ్నించారు. పోరాడకుంటే బానిసత్వం తప్ప విముక్తి లేదన్నారు. ఎన్నికలకు ముందు హామీలిచ్చి ఓట్లు వేయించుకుని ఎన్నికలయ్యాక మాట మార్చడం, మోసం చేయడం పరిపాటిగా మారిందని, దోపిడీ వర్గ పార్టీలన్నీ కార్మిక వర్గాన్ని మోసం చేస్తూనే ఉన్నాయని విమర్శించారు. కేరళలో వామపక్ష ప్రభుత్వం అంగన్వాడీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారి సంక్షేమానికి కట్టుబడి ఉందని, అలాగే రిటైర్మెంట్ పెన్షన్ ఇస్తుందని తెలిపారు. మోడీ ప్రభుత్వం అంగన్వాడీల బడ్జెట్‌లో కోత విధించి, పేద పిల్లల పొట్ట కొడుతుందని, పౌష్టికాహారానికి దూరంగా నెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.



దీక్షలను ప్రారంభిస్తున్న సింధు

దేశంలో అంబానీ, ఆదానీ కార్పొరేట్ల ఆస్తులు ఆకాశానికి వెళుతున్నాయని, పేదల పరిస్థితి దినదినగండం నూరేళ్ల ఆయుష్షులా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.భారతి, ప్రాజెక్టు లీడర్లు స్వర్ణకుమారి, కె.సత్యవతి, త్రివేణి, నాగమణి, విమల మొత్తం 30 మంది 24 గంటల రిలే దీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్, అంగన్వాడీల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు కె.విజయలక్ష్మి, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జె.గోపి పాల్గొన్నారు.

అమరుల ఆశయాలు సాధించాలి

అన్నే వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అమరవీరుల ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పవర్‌పేటలోని అన్నే భవనంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు వ్యవసాయ కార్మిక, రైతు ఉద్యమ నిర్మాత అమరజీవి అన్నే వెంకటేశ్వరరావు 21వ వర్ధంతిని రైతు సంఘం, వ్యకాస జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. అనంతరం జరిగిన సభకు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రవి మాట్లాడుతూ రైతులు, వ్యవసాయ కార్మికులు, కొల్లేరు ప్రాంత ప్రజల సమస్యలపై అన్నే వెంకటేశ్వరరావు నిరంతరం ఉద్యమాలు సాగించారని గుర్తు చేశారు. పంగిడిగూడెం జమిందారీ వ్యతిరేక భూ పోరాటానికి, అయ్యప్పరాజుగూడెం భూ పోరాటానికి, జిల్లాలో అనేక భూ పోరాటాలకు నాయకత్వం వహించి వేలాది ఎకరాల భూములను పేదలు సాధించుకోవడానికి ఆయన కృషి చేశారని చెప్పారు. గాంధీ పిలుపుతో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని ఆ తర్వాత పుచ్చలపల్లి సుందరయ్యతో ఏర్పడిన పరిచయంతో కమ్యూనిస్టు భావాల వైపు వచ్చి తుదిశ్వాస వరకు పీడిత ప్రజల కోసం పని చేశారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలోనూ, ప్రజాఉద్యమాల్లో పాల్గొని 14 ఏళ్ల జైలు జీవితం గడిపారని తెలిపారు. అన్నే స్ఫూర్తితో రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు సాగించడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ సభలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, అన్నే విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు ఆంజనేయులు, శారద, ఎస్.సత్యనారాయణ, మీసాల సత్యనారాయణ, ఎం.ఇస్సాకు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

రైతుల ధాన్యం బకాయిలు చెల్లించండి

ఏలూరు అర్బన్: సంక్రాంతిని దృష్టిలో పెట్టుకుని రైతులకు, కౌలురైతులకు ధాన్యం బకాయిలు పూర్తిగాచెల్లించాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పవర్‌పేటలోని అన్నే భవనంలో నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ఖరీఫ్ ధాన్యం కొనుగోలు సందర్భంగా ప్రభుత్వం గతం కంటే మెరుగ్గా ధాన్యం బకాయి సొమ్ములు చెల్లించినా గత నెల 23 తర్వాత ధాన్యం సొమ్ములు రైతుల ఖాతాలకు జమ చేయలేదన్నారు. దీనివల్ల ధాన్యం బకాయిలు అందని రైతులు, కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతి పండుగ అంటేనే రైతుల పండుగ అని రైతులు ధాన్యం అమ్మిన తర్వాత డబ్బులు చేతికి వస్తేనే ఇంటిల్లిపాది ఎంతో ఆనందంగా పండుగ జరుపుకుంటారని అయితే ధాన్యం సొమ్ములు అందకపోతే ఆ ఇంట సంక్రాంతి పండుగ వాతావరణం ఉండదని చెప్పారు. రబీ సాగుకు కౌలు రైతులకు వడ్డీ లేని పంట రుణాలివ్వాలని కోరారు. బ్యాంకుల నుండి కౌలు రైతులకు రుణాలు ఇవ్వడం లేదని చెప్పారు. ఈ సమావేశంలో బైరెడ్డి లక్ష్మణరావు, కస్తూరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రైతులను సంతృప్తిపరిచేలా భూ రీసర్వే : జెసి

ఏలూరు: భూహక్కు, భూ రక్ష పథకానికి సంబంధించిన రీసర్వే పనులు రైతులకు సంతృప్తినిచ్చేలా ఉండాలని జెసి బి.లావణ్యవేణి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో రీ సర్వేకు సంబంధించిన సమస్యలపై జిల్లాలోని సర్వేయర్ల ట్రైనింగ్ కార్యక్రమం ఎడి సర్వే పి.లక్ష్మణరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ భూ సర్వే నివేదిక రైతులను తృప్తిపరిచే విధంగా రూపొందించాలన్నారు. ఎఫ్ లైన్ సంబంధించిన పిటీషన్లు స్పందన కార్యక్రమంలో రైతుల వద్ద నుంచి వస్తున్నాయని వీటిని దృష్టిలో పెట్టుకుని ఎఫ్ లైన్ పిటీషన్లు రాకుండా మండల సర్వేయర్లు క్షేత్రస్థాయికి వెళ్లి రీసర్వేకు సంబంధించిన మార్గదర్శకాల ప్రకారం సర్వే జరిగిందా లేదా అనేది తెలుసుకోవాలన్నారు. రీసర్వే పూర్తయిన గ్రామాలకు సంబంధించి రీసర్వే నివేదిక పరిశీలించి స్పష్టతను గ్రహించాలన్నారు.

నిరసనల హోరు.. నేతలు బేజారు..!

'క్యాలెండర్ మారిందిగాని కష్టాలు మాత్రం తీరలేదంటున్నారు జిల్లాలోని వివిధ తరగతుల ప్రజలు. కొత్త ఏడాదొచ్చి వారం రోజులవుతోంది. అయితే తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళనబాటలో ఉన్న చిరుద్యోగులు ఏమాత్రమూ వెనుకంజ వేయకుండా పోరాటాల సంవత్సరమా అనేటట్లుగా వివిధ రూపాల్లో నిరసనలు సాగిస్తున్నారు. ఓపక్క ఎన్నికలు.. మరోపక్క ఆందోళనల నడుమ.. భవిష్యత్తు ఏమిటా అని అధికార పార్టీ నేతలు మల్లగుల్లాలు పడుతుండగా, వీటిని ఎలాగైనా తమకు అనుకూలంగా మలుచుకోవాలని ప్రతిపక్షాలు వ్యూహాలు రచిస్తున్నాయి.

జిల్లాలో అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరవధిక సమ్మెలో భాగంగా వివిధ రూపాల్లో నిరసనలు కొనసాగిస్తుండగా ఉపాధ్యాయులు సైతం దశలవారీ ఆందోళన చేపడుతున్నారు. అందరి మాట.. అందరి డిమాండ్ ఒక్కటే 'మీరిచ్చిన హామీలు అమలు చేయండి.. మేం చేసిన పనికి సంబంధించి బకాయిలు ఇవ్వండి'.. అయితే ఇవేమీ పట్టని ప్రభుత్వం నిర్బంధానికి పూనుకుని అంగన్వాడీల సమ్మెపై ఎస్మా ప్రయోగించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. దీనిపై జిల్లాలోని అంగన్వాడీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తీరు మార్చుకుని తమ సమస్యలు పరిష్కరించకుంటే 'మా సమ్మెపై ప్రభుత్వ నిషేధం కాదు.. త్వరలోనే ఈ ప్రభుత్వాన్నే మేం నిషేధిస్తాం' అంటూ చేస్తున్న నినాదాలు అధికార పార్టీ నేతలను కలవరపరుస్తున్నాయి. ఇక మున్సిపల్ కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం పోటీ కార్మికులను రంగంలోకి దింపగా ఎక్కడికక్కడ అడ్డుకుని వారిని వెనక్కి పంపుతున్నారు. దీంతో మున్సిపల్ అధికారులు పోలీసులను రంగంలోకి దింపి మున్సిపల్ కార్మికులను అరెస్టు చేయించడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఇక ఎస్ఎస్ఎ ఉద్యోగులు ఎస్‌పీడీ శ్రీనివాసరావు వ్యాఖ్యలతో రగిలిపోతున్నారు. ఇక యుటిఎఫ్ వినూత్నంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు వెంటనే విడుదల చేయాలంటూ చేపట్టిన దశలవారీ పోరు సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. మొత్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులతోపాటు చిరుద్యోగులు ఒక్కసారిగా రోడ్డెక్కడం అధికార పార్టీ నేతలను కలవరపరుస్తోంది. ఈ నేపథ్యంలోనే అంగన్వాడీల సమస్యలు కచ్చితంగా ఈ ప్రభుత్వం పరిష్కరిస్తుందని మంత్రులే బుజ్జగించే ప్రయత్నం చేయడం గమనార్హం. ఇదే క్రమంలో వివిధ తరగతుల ప్రజల్లో వైసిపి ప్రభుత్వంలో నెలకొన్న అసంతృప్తిని ఈ ఆందోళనలు ప్రతిబింబిస్తున్నాయని, తమ జోరు పెంచేందుకు ఇవి కచ్చితంగా ఉపకరిస్తాయని ప్రతిపక్ష టిడిపి నేతలు హుషారుగా కదులుతున్నారు. ఆచంటలో 'రా.. కదిలిరా' పేరిట నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు పెద్దసంఖ్యలో జనాన్ని తరలించేందుకు సమాయత్తమయ్యారు. అయితే ఆ పార్టీలోనూ ఇప్పటికీ సీట్ల కేటాయింపుపై స్పష్టత లేకపోవడం పెద్ద లోటుగా కన్పిస్తోంది. ఓపక్క జనసేనతో పొత్తు, మరోపక్క బలమైన నియోజకవర్గాల్లో గ్రూపు విబేధాలు ఆ పార్టీని వెంటాడుతున్నాయి. ఈ క్రమంలో ఆచంటలో నిర్వహించే సభలో తెలుగుతమ్ముళ్లకు చంద్రబాబు ఏమైనా సానుకూల సంకేతాలిస్తారేమోనని వారంతా ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఇక టిడిపితో పొత్తు ఖరారైనా జనసేన నేతల్లో మాత్రం జోరు కానరావడం లేదు. ప్రధానంగా జిల్లాలో ఏయే సీట్లు కేటాయిస్తారనే అంశం దగ్గర నుంచి పవన్ మళ్లీ భీమవరం నుంచి పోటీ చేస్తారా లేదా అనే మీమాంస ఆ పార్టీ నేతల్లో నెలకొంది. అదే క్రమంలో బిజెపితో పొత్తుపైనా సానుకూలంగా లేనట్లు తెలుస్తోంది. పెరిగిన ధరలు, రాష్ట్రానికి అన్యాయం వంటి అంశాలు బిజెపితో పొత్తు వల్ల తమకు ప్రతికూలమవుతాయని వారు అంతర్గత చర్చల్లో చెప్పుకోవడం విశేషం.



ఇదిలా ఉండగా అధికార పార్టీ వైసిపిలో ఇదే అనిశ్చితి కొనసాగుతోంది. చింతలపూడి సీటుపై పీటముడి వీడలేదు. ఓపక్క ప్రభుత్వ అధికారి విజయరాజుకు టిక్కెట్ ఓకే అయ్యిందని ఆయన అనుచరులు బాణసంచా కాల్చగా.. అదేమీ లేదని మళ్లీ ఎలిజాకే టిక్కెట్ అని ఆయన అనుయాయులు ఘంటాపథంగా చెబుతున్నారు. పోలవరంపై స్పష్టత వచ్చినా మిగిలిన సగం సీట్లకు సంబంధించి స్పష్టత రావాల్సి ఉండటం, ఎంపీ అభ్యర్థులెవరూ కానరాకపోవడం వంటి సమస్యలు అధికార పార్టీని వెంటాడుతున్నాయి. విధానాల ఫలితంగా ఏర్పడిన ప్రజావ్యతిరేకత, చిరుద్యోగుల ఆందోళనలు ఆ పార్టీకి తలనొప్పిగా పరిణమిస్తున్నాయి. మొత్తంగా చూస్తే కొత్త సంవత్సరంలో వివిధ తరగతుల ఆందోళనలు అందరిలోనూ చర్చనీయాంశమవుతున్నాయనడంలో ఎటువంటి సందేహమూ లేదు.


-వివిఎస్‌ఎస్‌వి.ప్రసాద్

వాస్తవాల వెలికితీతలో ప్రజాశక్తికి ప్రత్యేక గుర్తింపు

క్యాలెండర్ ఆవిష్కరణలో సిఐ మల్లేశ్వరరావు

ప్రజాశక్తి - చింతలపూడి

వాస్తవాలను ప్రజలకు తెలియజేయటంలో ప్రజాశక్తి పత్రికకు ప్రత్యేక గుర్తింపు ఉందని చింతలపూడి సిఐ మల్లేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ఆయన కార్యాలయంలో ప్రజాశక్తి 2024 క్యాలెండర్‌ను ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ప్రజాశక్తి వారధిగా పనిచేస్తూ మంచి చెడులను తెలియజేస్తుందని చెప్పారు. ప్రజాశక్తి పత్రికకు ప్రజల్లో మంచి పేరు ఉందన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సిఐ మల్లేశ్వరరావు

సమస్యలు పరిష్కరించాలి

మాతృభాష విద్యా వాలంటీర్ల రిలే దీక్షలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాతృభాష విద్యా వాలంటీర్లు రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలల వేతన బకాయిలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, శిక్షణ తరగతులు నిర్వహించాలని కోరుతున్నారు. పిఒ కక్ష సాధింపు చర్యగా వేతనాలు చెల్లించడంలో ఆలస్యం చేస్తున్నారన్నారు. అధికారులు మాతృభాష వాలంటీర్ల సమస్యలు పరిష్కరించకపోగా బెదిరింపులకు గురి చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని ఆందోళన చెందుతున్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

భీమడోలు ఎస్ఐగా సుధాకర్

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు ఎస్ఐగా మాయన సుధాకర్ శనివారం బాధ్యతలను స్వీకరించారు. ఆయన తూర్పుగోదావరి జిల్లా నుంచి బదిలీపై భీమడోలు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు సిబ్బంది, ఇతర అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.



ఎస్ఐ సుధాకర్

ఘనంగా గ్రాండ్ ఫినాలే పోటీలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక ఆర్ఆర్ పేటలోని నారాయణ పాఠశాలలో శనివారం స్పెల్ బి గ్రాండ్ ఫినాలే పోటీలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర సాహిత్య అకాడమీ ఛైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంగ్ల భాష ప్రావీణ్యతను తెలియజేసే ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పశ్చిమగోదావరి జిల్లా నారాయణ పాఠశాలల ఏజిఎం రామిరెడ్డి మాట్లాడుతూ నారాయణ పాఠశాలలో చదివిన విద్యార్థులు ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా ఉన్నత స్థానంలో ఉండాలని ఆకాంక్షించారు. ఆర్ఐ శ్రీనివాస్, బ్రాంచ్ ప్రిన్సిపల్ హేమలత, వన్ టౌన్ బ్రాంచ్ ప్రిన్సిపల్ కామేశ్వరరావు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన

పోలవరం: మండలంలోని పోలింగ్ స్టేషన్లను తహశీల్దార్ బి.సుమతి, ఎంపిడిఒ జి.శ్రీను శనివారం పరిశీలించారు. పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాలు, భద్రత ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ ఆహార పదార్థాల నాణ్యత పరిశీలించారు. ఆహార పదార్థాలు రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రాజబాబు, విఆర్ఒ దత్తు ఉన్నారు.

'రా కదలి రా' జయప్రదానికి పిలుపు

భీమడోలు: టిడిపి పిలుపు మేరకు నిర్వహించనున్న రా కదలి రా, జయహో బిసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు కోరారు. సదరు కార్యక్రమాల నిర్వహణ కోసం జిల్లాకు కేటాయించిన ప్రచార వాహనాలు గన్ని వీరాంజనేయులు పార్టీ కార్యాలయానికి శుక్రవారం రాత్రి చేరుకున్నాయి. వీటి సేవలను పార్టీ అధిష్టానం నిర్ణీత ప్రాంతాలకు కేటాయించింది. ఈ క్రమంలో సదరు వాహనాలను ఆయా ప్రాంతాలకు తరలించే కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. పార్టీ శ్రేణులతో కలిసి పార్టీ జెండా ఊపి సదరు వాహనాలను తరలించారు.

వీరబ్రహ్మాచారి మృతి కళారంగానికి తీరని లోటు

టి.నరసాపురం: బుర్రకథ కళాకారులు తిప్పర్తి వీరబ్రహ్మాచారి మృతి కళారంగానికి తీరనిలోటని ఉమ్మడి జిల్లా ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షులు, ఏలూరు జిల్లా ప్రజానాట్యమండలి సబ్ కమిటీ కన్వీనర్ టివిఎస్.రాజు శనివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. టి.నరసాపురం మండలంలోని బొర్రంపాలేనికి చెందిన వీరబ్రహ్మాచారి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. శనివారం పరిస్థితి విషమించి బొర్రంపాలెంలోని ఆయన స్వగృహంలో మృతిచెందారు. వీరబ్రహ్మాచారి మృతదేహాన్ని రాజు సందర్శించి నివాళులర్పించారు. ఐదు దశాబ్దాల పాటు వందలాది బుర్రకథలు చెప్పి వేలాదిమంది ప్రేక్షకుల మదిలో వీరబ్రహ్మాచారి నిలిచారన్నారు. ఆయన మృతికి ప్రముఖ బుర్రకథ కళాకారులు వీరమళ్ల సత్యనారాయణ, నందకుమార్, జానపద కళాకారుల సంఘం అధ్యక్షులు ఎల్ఆర్.కృష్ణబాబు, సీనియర్ జానపద కళాకారుడు చిలుకూరి సుబ్బయ్యచారి, సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ ఛైర్మన్ వి.మధు, పౌరాణిక రంగస్థలం కళాకారులు తోట లక్ష్మీనారాయణ, తోట సత్యనారాయణ, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి బిఎస్.సాగర్, అభినయ నాట్య అకాడమీ ముఖ్య కళాకారిణి ఎస్.రూపాదేవి, కోలాట కళాకారిణి బొందలపాటి పద్మావతి, పలువురు కవులు, కళాకారులు బ్రహ్మాచారి మృతికి నివాళులర్పించి వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.23.40 లక్షలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని శింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానం హుండీలను అధికారులు శనివారం లెక్కించారు. 86 రోజులకుగాను రూ.23,40,304 నగదు, తొమ్మిది గ్రాముల బంగారం, కేజీ 300 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ నేల సంధ్య తెలిపారు. లెక్కింపునకు పర్యవేక్షణ అధికారిగా గుడివాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ విచ్చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు బుసనబోయిన ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది, విఆర్ఒ రామసుబ్బయ్య పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రూ.50 లక్షల నగదు పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకులగూడెంలోని ఆంధ్రా, తెలంగాణ రాష్ట్ర సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద ఎటువంటి రశీదు లేని సుమారు రూ.50 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిఐ బి.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... శనివారం సాయంత్రం సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద ఎస్ఐ వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పి.సుభేష్ తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి నుంచి ఆంధ్రాలోని రావులపాలేనికి కారులో ఎటువంటి రశీదులు లేకుండా నగదును తీసుకెళ్తుండటంతో స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. విఆర్ఒల సమక్షంలో నగదును లెక్కించి ఐటి కార్యాలయనికి తరలించనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ వి.చంద్రశేఖర్, విఆర్ఒలు తిరుపతమ్మ మాధురి, సిబ్బంది ప్రవీణ్ పాల్గొన్నారు.

డోజర్ డ్రైవర్ మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టులో ఎగువ, దిగువ కాపర్ డ్యాముల మధ్య డోజర్‌తో ఇసుక పనులు చేస్తూ గోదావరి నదిలో కొట్టుకుపోయిన డ్రైవర్ జల్లి నాగేశ్వరరావు(45) మృతదేహం లభ్యమైంది. శుక్రవార సాయంత్రం రిస్క్యూ టీం సహాయంతో గాలించి అర్ధరాత్రికి మృతదేహాన్ని గుర్తించారు. శనివారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మున్సిపల్ కార్యాలయం ముట్టడి

జిల్లాలో కొనసాగిన కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మున్సిపల్ కార్మికులు సమ్మెను ఉధృతం చేశారు. ఈ సందర్భంగా శనివారం మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. నగరపాలక సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు నగరపాలక సంస్థ కార్యాలయం వద్దకు చేరుకుని ఆఫీసు గేట్లను మూసివేశారు. దీంతో సిబ్బంది, ఉద్యోగులు బయటే నిలిచిపోయారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల పట్ల ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని విమర్శించారు. రెండు దఫాలుగా చర్చలు జరిపినప్పటికీ ఎలాంటి పురోగతీ లేదన్నారు. ప్రధానంగా సమాన పనికి సమాన వేతనం, లేదా పిఆర్‌సికి అనుగుణంగా వేతనం పెంపుదల విషయంలో ప్రభుత్వం చొరవ చూపడం లేదని విమర్శించారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో సమ్మెను ఉధృతం చేస్తున్నామని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడి మున్సిపల్ కార్మికుల సమ్మెను విరమింపజేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎనిమిదో తేదీన కలెక్టరేట్ల ముట్టడిస్తామని హెచ్చరించారు. సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాధరావు మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలనే మున్సిపల్ కార్మికులు అడుగుతున్నారని, కొత్త కోరికలేమీ లేవన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం వల్లే కార్మికులు సమ్మెకు దిగారని, ఈ సమ్మెకు ప్రభుత్వానిదే బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమానికి నాయకులు లావేటి కృష్ణారావు, ఎ.జాన్‌బాబు, బంగారు వెంకటేశ్వరరావు, బండిరాజు, నాగరాజు, హనుమంతరావు, నారాయణ, పోతురాజు, ఆర్లప్ప, రమేష్, సత్యవతి, పాప, మరియమ్మ, భాగ్యలక్ష్మి, రమణమ్మ, రాజమ్మ, లక్ష్మి, రమణ, చంద్రావతి, దుర్గ, రాజు, గణేష్ నాయకత్వం వహించారు.



ఏలూరు మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు, నాయకులు

జనసేన మద్దతు

మున్సిపల్ కార్మికుల సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ సమ్మెను పోటీ కార్మికులతో విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం పూనుకోవడం దుర్మార్గమన్నారు. సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయనతోపాటు జనసేన నాయకులు ఒబిలిశెట్టి శ్రావణ్‌కుమార్ గుప్త, అల్లు సాయి చరణ్, బొత్స మధు, బొండా రాము ఉన్నారు.

చింతలపూడి : నగరపంచాయతీ మున్సిపల్ కార్మికులు మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌విఎస్.నారాయణ మాట్లాడుతూ సిఎం జగన్ మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేస్తామనే హామీని అమలు చేయాలని, చింతలపూడి నగర పంచాయతీలో కార్మికులకు చెల్లించాల్సిన కోట్లాది రూపాయల బకాయిలను వెంటనే చెల్లించాలని, కార్మికులందరినీ ఆప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జి.నాగరాజు, వి.పద్మ, షేక్ సలీం, నాగరాజు, కమలకుమారి, రాజి, నాగమణి, కె.నాగరాజు పాల్గొన్నారు.

నూజివీడు : మున్సిపల్ కార్మికుల సమ్మె 12 రోజు స్థానిక చిన్నగాంధీ బొమ్మ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి జి.రాజు, ఎఐటియుసి పట్టణ ప్రధాన కార్యదర్శి సిహెచ్.పుల్లారావు, మున్సిపల్ యూనియన్ నాయకులు జయలక్ష్మి, గోవిందు, రజని, ఉషారాణి, రాణి, పద్మ, పంగి డిమ్మ, గౌరీ, చంద్రశేఖర్, రాజేంద్ర, పృధ్వీరాజు, గాంధీ, విజయ్, జయరాం, ఏడుకొండలు, గంగాధర్ పాల్గొన్నారు.

పిల్లలను బడికే పంపాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ స్థానిక పవర్‌పేటలోని మేదర్ల కాలనీలో బాల కార్మికులపై శనివారం ఆరా తీశారు. తల్లిదండ్రులు వారి పిల్లలను బడికి పంపకుండా పనిలో పెట్టి పనులు చేయిస్తున్నారా అని ఇంటింటికి వెళ్లి సమాచారాన్ని తెలుసుకున్నారు. ఆపరేషన్ స్వేచ్ఛ 2024 కార్యక్రమంలో భాగంగా ఈ కాలనీని సందర్శించి తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దిశ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి ప్రియా, ఎఎల్ జె.గోపాలకృష్ణ, ప్యానల్ లాయర్స్ కె.కృష్ణారావు, కె.సత్యనారాయణ, జి.విజయ్‌భాస్కర్, హెల్ప్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ బహవనంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా సంస్థ నిరోధం అంశంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో మానవ అక్రమ రవాణా సంస్థ నిరోధంపై తీసుకుంటున్న చర్యలు, బాధితులకు అందిస్తున్న వసతులపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరులు, చైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.పద్మావతి, డిసిపిఒ సూర్య చక్రవేణి, కన్స్యూమర్ ఫోరమ్ మెంబర్ నాగలక్ష్మి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఇస్రోపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ఇస్రో శాస్త్రవేత్త

ప్రజాశక్తి - ఉంగుటూరు

కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత అంతరిక్ష ప్రయోగ ఫలితాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇస్రో రిటైర్డ్ సైంటిస్టు శివప్రసాద్ ఇస్రో సంస్థ ఏర్పాటు చేసిన దగ్గర నుంచి ఇటీవల చంద్రయాన్ 3 వరకు మనదేశంలో జరిగిన అంతరిక్ష ప్రయోగాల గురించి విద్యార్థులకు వివరించారు. రాకెట్ ప్రయోగంలోని వివిధ దశలు, కక్ష్యలో ప్రవేశపెట్టే విధానం, వాటిని పంపించడం వల్ల మానవాళికి జరుగే ప్రయోజనాల గురించి వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు అంతరిక్ష పరిశోధనల పట్ల అవగాహన పెంచుకుని ప్రయోగాల్లో భారతదేశాన్ని అగ్రగామి దేశంగా నిలపాలని ఆకాంక్షించారు. విశిష్ట అతిథి ఎంఇఒ-2 కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ భవిష్యత్తులో స్పేస్ టెక్నాలజీకి అత్యంత ప్రాధాన్యత ఉన్నందున విద్యార్థులందరూ టెక్నాలజీ పట్ల అవగాహన పెంచుకుని వాటిని మానవాళి మంచి కోసం ఉపయోగించి భవిష్యత్తులో ఉన్నత వ్యక్తులుగా ఎదగాలని అభిలషించారు. అనంతరం సైంటిస్టును సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌కుమార్, భువనేశ్వరి, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎంఎల్ఎ బాలరాజు

జీలుగుమిల్లి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పోలవరం నియోజకవర్గ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తెల్లం రాజ్యలక్ష్మితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైసిపి ప్రభుత్వానికే చెందుతుందన్నారు. రాష్ట్రంలో ప్రజలకు జగన్ ప్రభుత్వం సుస్థిర పాలనను అందిస్తుందన్నారు. పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజ్యలక్ష్మి మాట్లాడారు. అనంతరం మండలంలో నూతనంగా మంజూరైన పెన్షన్లను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు వసంతరావు, సర్పంచులు చిర్రి జగదాంబ, సున్నం ఉషారాణి, వైస్ ఎంపిపి సోమగాని శ్రీనివాస్, ఉప్పల లతకుమారి, మండల అధ్యక్షులు ప్రసాద్, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్, సొసైటీ అధ్యక్షులు శ్రీనివాస్, కక్కిరాల రాము, ప్రేమ్‌కుమార్, రాంపండు, రాముడు, ఎంపిడిఒ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

'వైసిపిది అరాచక పాలన'

ఉంగుటూరు: తన అరాచక పాలనతో ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో ఓటమి కళ్లముందే కనపడటంతో సిఎం జగన్ మూర్ఖత్వం పరాకాష్టకు చేరిందని జనసేన పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు 26 రోజులుగా అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెపై ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించటం దారుణమన్నారు. అంగన్వాడీ ఉద్యమానికి మొదటినుంచి జనసేన పార్టీ పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తుందని, వారు తీసుకునే ఎలాంటి నిర్ణయాలకైనా జనసేన అండగా ఉంటుందని చెప్పారు.

వంగవీటి విగ్రహాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

స్థానిక ప్రభుత్వాసుపత్రి సమీపంలో ఏర్పాటు చేసిన వంగవీటి రంగా విగ్రహాన్ని ఆయన కుమారుడు వంగవీటి రాధ శనివారం ఆవిష్కరించారు. తొలుత జంగారెడ్డిగూడెం నుండి ర్యాలీగా కొయ్యలగూడెం చేరుకున్నారు. అలాగే పరింపూడిలోనూ రంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరాటం రాంబాబు, మాజీ ఎంపీ మాగంటి బాబు, ముళ్లపూడి బాపిరాజు, పోలవరం టిడిపి ఇన్‌ఛార్జి బొరగం శ్రీను, జెట్టి గురునాధం, సర్పంచి ముప్పిడి దేవి, గంజిమాల దేవి, మేఘాలా దేవి, తాడికొండ మురళీ, జనసేన ఇన్‌ఛార్జి బాలరాజు, దుగ్గిన శ్రీను పాల్గొన్నారు.

తహశీల్దారు కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

చాటపర్రు తహశీల్దార్ కార్యాలయాన్ని దెందులూరు ఎంఎల్ఎ అబ్బయ్య చౌదరితో కలిసి ఏలూరు ఎంఎల్ఎ ఆళ్ల నాని ప్రారంభించారు. కొత్తగా ఏర్పాటు చేసిన తహశీల్దారు కార్యాలయం వల్ల ఏలూరు చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాలకు సేవలు వేగిరం అందుతాయని నాని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు శ్రీనివాసరావు, సర్పంచి గుడిపూడి రఘు, మండల నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగానికి తూట్లు పొడిచేలా బిజెపి పాలన

కేంద్ర మాజీ మంత్రి జెడి శీలం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

భారత రాజ్యాంగాన్ని తూట్లు పొడిచే విధంగా పరిపాలిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించేవరకూ ఎవరూ విశ్రమించకూడదని కేంద్ర మాజీ మంత్రి జెడి.శీలం పేర్కొన్నారు. స్థానిక మర్చంట్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కళ్యాణ మండపంలో కాంగ్రెస్ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు అధ్యక్షతన దళిత, గిరిజన, బిసి, మైనారిటీ నాయకులతో, వివిధ ప్రజా సంఘాల నాయకులతో, ప్రజా ప్రతినిధులతో, వివిధ వర్గాల మేధావులతో శనివారం ప్రతిష్టాత్మకంగా సమాలోచన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మాజీ మంత్రి జెడి శీలం మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, అమరావతి రాజధాని నిర్మాణం, నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో ఉన్న వైసిపి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి చేసిందేమీలేదన్నారు. వీరి పరిపాలన కాలంలో రాష్ట్రాన్ని 20 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లారన్నారు. సదస్సులో కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ విభాగ అబ్జర్వర్ కొరివి వినయ్‌కుమార్, రాష్ట్ర కాంగ్రెస్ ఆదివాసీ గిరిజన విభాగ ఛైర్‌పర్సన్ పాచిపెంట శాంతకుమారి, కాంగ్రెస్ ఎస్‌సి సెల్ రాష్ట్ర ఛైర్మన్ సాకే శంకర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, జిల్లా ఆర్గనైజేషన్ జనరల్ సెక్రటరీ ముప్పిడి శ్రీనివాస్, రిటైర్డ్ ఐఆర్‌ఎస్ అధికారి సజీవి, సిపిఐ నేత ఆదిశేషు, భారత్ బచావో నేత గుబ్బల నాగేశ్వరరావు, జాతీయ మాల మహానాడు నేత అలగా రవికుమార్, ఆమ్‌ఆద్మీ పార్టీ నేత ఎస్‌కె ఎండీ భాషా, పలు క్రైస్తవ సంఘ సంస్కర్తలు, పలువురు రాజకీయ విశ్లేషకులు పాల్గొన్నారు.

క్రీడల నిర్వహణకు నాలుగు కేంద్రాలు ఎంపిక

ప్రజాశక్తి - భీమడోలు

ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి క్రీడల నిర్వహణకు నాలుగు కేంద్రాలను ఎంపిక చేసినట్లు ఎంపిడిఒ సిహెచ్.పద్మావతిదేవి తెలిపారు. ఆడుదాం ఆంధ్రా వార్డు, గ్రామస్థాయి ఆటల పోటీల ముగింపు కార్యక్రమాన్ని మండల పరిధిలోని నాలుగు కేంద్రాల్లో శనివారం నిర్వహించారు. భీమడోలులో నిర్వహించిన కార్యక్రమానికి ఎంపిడిఒ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి పోటీలు భీమడోలు హైస్కూల్ కేంద్రంగా నిర్వహించేందుకు సన్నాహాలను చేశామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ పోటీలను పూళ్ల, భీమడోలు, గుండుగొలను, ఆగడాలలంక కేంద్రాల్లో నిర్వహించేందుకు తాజాగా ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల పదో తేదీ నుంచి 23వ తేదీ వరకు మండల స్థాయి పోటీలు నిర్వహించేందుకు చర్యలను చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో భీమడోలు సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు పి.సునీతమాన్సింగ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎన్.ఠాగూర్, ఎం.వెంకట్రావు, స్వచ్ఛంద సంస్థ చైతన్య యువజన సంఘం అధ్యక్షులు పాము మాన్సింగ్, పంచాయతీ విస్తరణ అధికారి ఎ.సుందరి, పలువురు అధ్యాపకులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ భావజాలంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి - ఏలూరు

జన్ భాగీధారి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులకు భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భావజాలంపై వివిధ పోటీలు నిర్వహించినట్లు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్ రీజనల్ ఇన్స్పెక్టింగ్ ఆఫీసర్ (ఆర్ఐఒ) కె.చంద్రశేఖరరావు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భావజాలంపై వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ జూనియర్ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. వ్యాసరచన పోటీల్లో గోపాలపురం అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి కె.కృష్ణవేణి ప్రథమ బహుమతి, ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి పిఎన్.భానుజా ద్వితీయ బహుమతి, గోపాలపురం అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి జి.శరణ్య తృతీయ బహుమతి పొందారు. వక్తృత్వ పోటీల్లో వై.జెస్సిక, జి.హారిక, డి.వసంతి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. చిత్రలేఖనంలో ఇ.భారతి, పి.దీపిక, జి.ప్రవల్లిక ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. క్విజ్ పోటీల్లో జిఎస్ఎస్.నితీష్ బృందం, కె.వైష్ణవి బృందం, కెడి కుమార్ బృందం ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. ఈ కార్యక్రమాలను ఆర్ఐఒ కె.చంద్రశేఖరరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ టిఎం.ధనుంజయరావు, ఇతర కాలేజీ సిబ్బంది పర్యవేక్షించారు.

కొండదొరలకు ఎస్‌టి సర్టిఫికెట్లు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని గురజ ఎస్‌టి కాలనీలో నివసిస్తున్న కొండదొరలకు త్వరలో ఎస్‌టి సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఎస్‌టి కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతికి ముందే అర్హులైన కొండదొరలకు సర్టిఫికెట్లు జారీకి జిఒ జారీ చేసిందన్నారు. రెండు నెలల క్రితం జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో వచ్చిన కమిటీ ఎస్‌టి కాలనీకి వచ్చి విచారణ చేసి ఆ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించిందన్నారు. ఆ నివేదిక మేరక కొండదొరలందరికీ ఎస్‌టి సర్టిఫికెట్ ఇచ్చేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షులు ఎం.ఏసుబాబు, గ్రామ సర్పంచి మంచాల సరస్వతి, ఉప సర్పంచి పి.కిరణ్మయి పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రెడ్ క్రాస్ ఎంపిహెచ్‌డబ్ల్యు ఫిమేల్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఖాళీగా ఉన్న నర్సింగ్ ట్యూటర్స్ ఫిమేల్ (3), శానిటరీ ఇన్‌స్పెక్టర్ (1), డ్రైవర్ (1), స్వీపర్ ఫిమేల్ (1) ఉద్యోగాలను తాత్కాలిక నెలవారి స్థిర వేతనం ప్రాతిపాదికన భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. పూర్తి వివరాలతో దరఖాస్తులను అర్హతలను ధ్రువపరిచే పత్రాలతో ఈ నెల 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోగా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ కార్యాలయంలో అందించాలని తెలిపారు. వివరాలకు 9848177142, 8919102822 సంప్రదించాలని తెలిపారు.

మామిడి రైతులకు అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని బోరవంచ, రావిచర్ల గ్రామాల్లో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో శనివారం మామిడి రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యాన శాఖాధికారి ఆర్.హేమ సిబ్బందితో కలిసి మామిడి తోటలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖాధికారి మాట్లాడుతూ పూత రాని మామిడి తోటల్లో రైతులు పిచికారీ చేయాల్సిన రసాయనక మందులను, వాటిని వాడే విధానాల గురించి రైతులకు వివరించారు. ప్రతి రైతు మామిడి విధానంలోని మెలకువలను తెలుసుకుని అధిక దిగుబడి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

'వైసిపి హయాంలో వ్యవస్థలన్నీ నాశనం'

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

సిఎం జగన్ అసమర్థ పాలనతో వ్యవస్థలన్ని నాశనమయ్యాయని టిడిపి నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు విమర్శించారు. బుట్టాయగూడెం క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జరగబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి భారీ మెజారిటీతో విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు సురక్షమైన ప్రజారంజక పాలన అందిస్తామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్‌టి సెల్ కార్యదర్శి సున్నం నాగేశ్వరరావు, ఐటిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షులు శావిలి సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర ఎస్‌సి సెల్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ మానేల్లి బాలు, మేఘనాథ్ పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజ శ్రీ భీమవరం III అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి వారి కోర్టులో
A.S.No.26/2023

అప్పిలెంట్ : సమయమంతుల సత్యనారాయణ
రెస్పాండెంట్లు : M.J.కాల్విన్ (Died). మరియు ఇతరులు
10వ రెస్పాండెంటు : మత్తి అన్నమ్మ అగస్టీన్, C/o పిడిగె సామ్యూల్ వరప్రసాద్ R/o పెదపేట, ఆకివీడు, ఆకివీడు మండలం, ప॥గో॥జిల్లా, B.J.C.J.C
11వ రెస్పాండెంటు : మత్తి రాజ అగస్టీన్, C/o పిడిగె సామ్యూల్ వరప్రసాద్ R/o పెదపేట, ఆకివీడు, ఆకివీడు మండలం, ప॥గో॥జిల్లా, B.J.C.J.C

పై నెంబరు అప్పీలు గ్రంధంలో కోర్టువారు 10 మరియు 11 రెస్పాండెంట్లుకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను, తీసుకొనక కావాలని జాప్యం చేయుచున్నారు. కావున ది.24-01-2024న తేదీన ఉదయం 10 గం॥లకు శ్రీకోర్టు వారి ఎదుట మీరు స్వయంగాగాని, లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కాగలరు. లేనియెడల మీ పరోక్షమున పై అప్పీలు తీర్మానించబడును.

భీమవరం
06.01.2024

పట్నాల శ్రీనివాస్,
అడ్వకేట్ తెలగవారి వీధి,
గునుపూడి-భీమవరం-1,
సెల్ : 97017 40828.

CHANGE OF NAME

I, MOHAMMAD AIESHA, W/o. Mohammad Zafrulla, D.No. 12-2-27, Old Bazar, Narsapuram, Narsapuram Mandal, W.G.Dt. A.P. I have changed my name from MOHAMMED AIESHA BEGUM, (Old name) to MOHAMMAD AIESHA, (New name) hence forth I am being called MOHAMMAD AIESHA, W/o. Mohammad Zafrulla, for all purposes.

డాక్యుమెంట్స్ పోయినవి

పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం మండలం, రేలంగి గ్రామ పరిధిలో ఉన్న ధనలక్ష్మి అపార్ట్‌మెంట్స్ ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోయినవి.
నెంబర్ 1913/2014, 1914/2014, 1915/2014, 1916/2014
నెంబర్లు గల డాక్యుమెంట్స్ తీసుకొని పెరవలి నుండి తణుకు వెళ్తుండగా మార్గమధ్యలో పడిపోయినవి దొరికిన వారు ఈ క్రింది చిరునామాకు అందజేయగలరు.
అడ్రస్: గునిపేల సత్యనారాయణ
S/o : కోటేశ్వరరావు, D.No : 4-11B,
నల్లాకులవారిపాలెం, పెరవలి మండలం, తూ॥గో॥జిల్లా.
సెల్ : 9963413503

In the court of the Addl. Senior Civil Judge, Eluru, W.G.Dt
E.P. 34/2023 O.S.No. 37/2022
Between :
Sri. Vemulapalli Purna Naveen Kumar - Petitioner / DHR
Vs
Smt. Maradani Krishna Kumari - Respondent/JDR
JDR : Smt. Maradani Krishna Kumari, W/o. Srinivasa Rao @ Ravi, Dr.No. 2-12, Veerammakunta (V), Pedapadu Mandal, Eluru Distirct, Eluru JCJC

పై నెంబరు గ్రంధములో ఈ దిగువ జెడిఆర్ స్వాధీనములో వున్న ఆస్థిని పైకోర్టు వారు ఆర్డర్ ప్రకారము ది.22-1-2024వ తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం గం.10-30 ని॥లకు బహిరంగముగా వేలము వేయబడును. కావున వేలంపాటలో పాడుకొన దలచుకున్నవారు తమ ఆధార్ కార్డులతో వచ్చి వేలము పాటలో పాల్గొనవలసినదిగా కోరి ప్రార్థిస్తున్నాము.

షెడ్యూలు

West Godavari District, Vatluru Sub-Division, Pedapadu Mandal, Veerammmakunta Panchayati, Pedapadu Part-2 Village, R.S.No. 1314 in an extent of Ac.2-67cents (or) 1.081 hectors of Fish Tank
Bounded by :
East : Murugu Bode
West : Fish Tank of Pudi Gandhi
South : Raju Kodu
North : Fish Tank of Marradu Siva Ramakrishna Garu
DHR Value : Rs. 30,00,000/-
Ameena Value : Rs. 75,00,000/-
P. Bhaskara Narasimha Murthy
Advocate, D.No. 24B-2-20,
Pathebada, Eluru, Cell : 9848143125